




రేకుర్తిలో అమ్మవారిని ప్రతిష్ఠిస్తున్న పూజారులు, గద్దెల వద్ద భక్తులు

జన జాతర ప్రారంభం



● కొలువు దీరిన సారలమ్మ ● నేడు గద్దెలపైకి రానున్న సమ్మక్క


అమ్మవారి రాకను తిలకిస్తున్న భక్తులు


రేకుర్తిలో శివసత్తుల పూనకాలు



కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 21: సారలమ్మ గద్దెలపై కొలువు దీరడంతో సమ్మక్క సారలమ్మ జాతర సంరంభం బుధవారం ప్రారంభమయ్యింది. జాతర ప్రాంగణాలకు పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుంటున్నారు.. ఎక్క డ చూసినా జాతర సందడే కనపడుతున్నది. బుధవారం పూజారులు రెండు గంటల పాటు రహస్యంగా పూజలు నిర్వహించి ఆడారపు కుండల రూపంలో సారలమ్మ తల్లిని డప్పుల చప్పుళ్లు, మంగళహారతుల మధ్య తీసుకుని వచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. గురువారం సాయంత్రం 5 గంటలకు కుంకుమ భరిణె రూపంలో సమ్మక్కతల్లిని గద్దెకు తీసుకు వస్తారు. మేడారం జాతర ఉత్సవాలకు జిల్లా నుంచి లక్షల మంది భక్తులు తరలి వెళ్లారు.

రేకుర్తిలో భక్తుల కోలాహలం...

శివసత్తుల పూనకాలు, భక్తుల కోలాహలం, భక్తి పారవశ్యం నడుమ డప్పు చప్పుళ్ల మధ్య రేకుర్తిలో జాతర ఘనంగా ప్రారంభమైంది. కోయ పూజారి విఘ్నేశ్ బృందం ఎదుకలగుట్ట నుంచి సారలమ్మను గద్దె పైకి తీసుకు వచ్చారు. జాతర చైర్మన్ పిట్టల శ్రీనివాస్, జాతర అధికారి ఎండపెల్లి మారుతి, సిబ్బంది గుడికాడి శ్రీనివాస్, కార్పొరేటర్ సుద గోని మాధవి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్ అమ్మ వారిని తీసుక వచ్చే ముందు గుట్టపై భారీగా బాణసంచా పేల్చారు. సుమారు 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. రోప్ పార్టీ, డిస్ట్రిక్ గార్డ్స్, వాలంటీర్స్ సేవలందించారు. జాతరకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమాచార కేంద్రాలు ఏర్పాటు చేశారు.

● **చొప్పదండి:** మండలంలోని చొప్పదండి, రాగంపేట, గుమ్లాపూర్‌లో బుధవారం జాతర ఘనంగా ప్రారంభమైంది. చొప్పదండి హన్మాన్ ఆలయం నుంచి సమ్మక్క జాతర ప్రాంగణం వరకు సారలమ్మ, పగిడిద్దెరాజుల శోభాయాత్ర నిర్వహించారు. యాత్రలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్ పర్సన్ ఇప్పనిపల్లి విజయలక్ష్మి, చీకట్ల లచ్చయ్య పాల్గొన్నారు.

● **ఇల్లందకుంట:** మల్యాలలో బుధవారం సాయంత్రం సారలమ్మను కోయ పూజారులు పూజలు నడుమ, డప్పుచప్పుళ్లు, పూనకలతో గద్దెపైకి తీసుకు వచ్చారు.



● **హుజూరాబాద్:** హుజూరాబాద్‌లోని సారలమ్మ ఆలయం నుంచి పూజారులు పూజలు చేసి అమ్మవారిని డప్పు చప్పుళ్లు, బోనాలతో ఊరేగింపు నిర్వహించారు.

● **శంకరపట్నం:** కేశవపట్నంతో పాటు ఆముదాలపల్లి, గద్దపాకలో జాతర ఘనంగా ప్రారంభమైంది. కేశవపట్నంలో సారలమ్మను గ్రామ శివారులోని ఎంకయ్య గుట్ట నుంచి పూజారులు, జాతర కమిటీ సభ్యులు సారల మ్మను తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు.

● **సైదాపూర్:** మండలంలో సైదాపూర్-జాగీర్‌పల్లి గ్రామాల మధ్య ఊరగుట్టపై, వెన్నంపల్లి గ్రామ శివారులో జరిగే జాతర ప్రారంభమయింది. కోయ పూజారులు సారలమ్మ, పగిడిద్దెరాజును గద్దెపైకి తీసుకొచ్చారు.

● **జమ్మికుంట:** పట్టణ పరిధిలోని కేశవపూర్‌లో సమ్మక్క సారలమ్మ జాతర వైభవంగా ప్రారంభం అయింది. బుధవారం మేడారం కోయ పూజారులు సారలమ్మను గద్దెల మీదకు తీసుకువచ్చారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు హాజరయ్యారు. పట్టణ సీఐ వరగంటి రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

● **గంగాధర:** మండలంలోని బూరుగుపల్లి, మధురానగర్‌లో సమ్మక్కసారలమ్మ జాతర ప్రారంభమైంది.

● **గన్నేరువరం:** మండలంలో గన్నేరువరం, మైలారంలో సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభమైంది. బుధవారం సారలమ్మను గద్దెపై ప్రతిష్ఠించారు. ఎస్ఐ చందా నర సింహారావు జాతర ఏర్పాట్లను పరిశీలించారు.







శంకరపట్నం, వీణవంక, జమ్మికుంటలో అమ్మవారిని తీసుకువస్తున్న పూజారులు



చొప్పదండిలో శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుంటాం


బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 21: ఆదర్శ నగర్ అగ్ని ప్రమాదం బాధితులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఆదర్శ నగర్‌లో అగ్ని ప్రమాద ఘటన స్థలాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఉదయం పరిశీలించి బాధితులను పరామర్శించి ప్రమాదం, నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అగ్ని ప్రమాదం తీవ్ర స్థాయిలో జరిగిందన్నారు. కూలీలందరూ సమ్మక్క జాతరకు మేడారం వెళ్లినందున ప్రాణనష్టం జరగలేదని, వారిని భగవంతుడే కాపాడాడన్నారు. బాధిత కూలీలకు భోజనం, తాత్కాలిక నివాసం ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించి నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరఫున బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, వంట పాత్రలు అందజేస్తామన్నారు. రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ ఇళ్ల పథకాల్లో అవకాశం ఉన్నచోట నివాస సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ పాలకులు గొప్పగా చెప్పుకున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పూర్తి నాణ్యత లోపంతో ఉన్నాయని, వాటిని పేదలకు కేటాయించడానికి సమయం పడుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను రికవరీ చేసి నిరుపేదలకు అందజేస్తామన్నారు. త్వరలో నియోజకవర్గానికి మూడు వేల ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేసే కార్యాచరణ ప్రారంభిస్తున్నామన్నారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన 17 కుటుంబాలకు మాజీ కార్పొరేటర్ నడిపెల్లి అశోకరావు రూ. 5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కార్పొరేటర్ మేచినేని అశోక్‌రావు, నడిపెల్లి అశోక్‌రావు, ఆకారపు భాస్కర్‌రెడ్డి, కుర్ర పోచయ్య, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, దండి రవీందర్, బసవరాజు శంకర్, అమేర్ పాల్గొన్నారు.

భూ కబ్జాలపై కొరడా



- ఇప్పటికే ఇద్దరు కార్పొరేటర్లు సహా 11 మంది అరెస్టు
- వారిలో ఒక కార్పొరేటర్‌పై రౌడీషీట్ ఓపెన్
- తాజాగా మరో మహిళా కార్పొరేటర్, తహసీల్దార్‌పై కేసు నమోదు
- మరికొందరు ప్రజాప్రతినిధులు, ఇతరుల అరెస్టుకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్‌లో భూకబ్జాదందాలో అరెస్టులు, కేసుల నమోదు పర్వం కొనసాగుతోంది. భూఆ క్రమణదారుల వెన్నులో వణుకుపుట్టించేలా పోలీసు కమిషనర్ అభిషేక్ మొహంతి తనదైనశైలిలో కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లను అరెస్టు చేయగా వారిలో ఒకరిపై రౌడీ షీట్ ఓపెన్ చేశారు. భూకబ్జా చేశారనే ఆరోపణలతో మరో తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. భూఆక్రమణల పై సీపీకి ప్రతి రోజు పదుల సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. ఇప్పటి వరకు భూఆక్రమణలు, ఆర్థిక నేరాలు, ఇతరత్రా మోసాలకు సంబంధించి 1030 ఫిర్యాదు వచ్చాయి.

రాజీ కోసం ప్రయత్నాలు

వరుస అరెస్టులో భయాందోళనకు గురైన కబ్జాదారులు రాజీ కోసం ప్రయత్నిస్తున్నారు. మధ్యవర్తుల ద్వారా బాధితులను సంప్రదించి రాజీ కుదుర్చుకుంటూ స్థలాలను అప్పగిస్తున్నారు. ఇంకొందరు సీపీకి ఫిర్యాదు చేయకుండా రాజీ చేసుకుంటున్నట్లు సమాచారం.

● ఇప్పటి వరకు నమోదైన కేసులు, అరెస్టులు

భూకబ్జా, దౌర్జన్యం, బెదిరింపులకు పాల్పడినట్లు గత డిసెంబరు 24న కరీంనగర్ ఒకటో టౌన్‌లో నమోదైన కేసులో కరీంనగర్ కార్పొరేటర్ తోట రాములు, బీఆర్ఎస్ నాయకుడు చీటి రామారావులను కరీంగర్ ఒకటో టౌన్ పోలీసులు జనవరి 17న అరెస్టు చేశారు. మూడో నిందితుడు శ్యాంను వారం రోజులకు పోలీసులు అరెస్టు చేశారు.

● సీతారాంపూర్ 21వ డివిజన్ కార్పొరేటర్ జంగిలి సాగర్ భూకబ్జాలు, బెదిరింపులు, అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యాలకు పాల్పడినట్లుగా సీతా రాంపూర్‌కు చెందిన రిటైర్డ్ టీచర్ తాటిపల్లి లింగారెడ్డి కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనవరి 24న జంగిలి సాగర్‌ను అరెస్టు చేశారు. జంగిలి సాగర్‌పై కరీంనగర్ రూరల్, కొత్తపల్లి స్టేషన్లలో మరో మూడు కేసులు నమోదయ్యాయి. జంగిలి సాగర్ జైలులో ఉండగానే కొత్తపల్లి పోలీసులు అతనిపై రౌడీషీట్ ఓపెన్ చేశారు.

● కరీంనగర్ రూరల్ మండలం ఆరెపల్లి సర్పంచ్, కార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేసి, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఇంటిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కేసులో తీగలగుట్టపల్లి మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్య, అతని అనుచరుడు లక్ష్మణ్‌ను ఫిబ్రవరి 1న పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.

● ఇళ్ల నిర్మాణంలో ఉండగా ఎనిమిది పిల్లర్లను కూల్చివేసి, భూకబ్జాకు పాల్పడిన కేసులో ఆర్టీఏ మాజీ మెంబరు కరీంనగర్ జ్యోతినగర్‌కు చెందిన తోట శ్రీపతిరావును ఫిబ్రవరి 6న కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. శ్రీపతిరావు, పొన్నాల కనుకయ్య, పవన్, సిరిపురం వెంకటరాజు, మరి కొంతమందిపై కేసు నమోదు చేశారు.

● రేకుర్తిలోని సర్వే నెంబరు 119లో 25 గుంటల భూమికి, సర్వే నెంబరు 79/బిలో 20 గుంటల భూమికి నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి వేములవాడకు చెందిన గునుకుల రాజిరెడ్డికి విక్రయించి మోసానికి పాల్పడిన కేసులో కార్పొరేటర్ల భరత్తు కోల ప్రశాంత్, సుధగోని కృష్ణగౌడ్‌తోపాటు వారి అనుచరుడు ఏలేటి భరత్‌రెడ్డిని కొత్తపల్లి పోలీసులు అరెస్టు చేశారు. జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారు.

● నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూ ఆక్రమణలకు పాల్పడ్డారనే కేసులో ఈ నెల 20న మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు నందెల్లి మహిపాల్‌తో పాటు 26వ డివిజన్ కార్పొరేటర్ నక్క పద్మ, బీఆర్ఎస్ నాయకుడు కొత్తకొండ శ్రీను అలియాస్ మైకెల్ శ్రీను, గుండ రాజమల్లు, గంగాధర కనుకయ్య, నక్క జితెందర్, తాటిపాముల రాజు, మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌పై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నందెల్లి మహిపాల్‌ను అరెస్టు చేశారు.


స్వామివారి రథం నడుపుతున్న మంత్రి పొన్నం


నంది కోల కళాకారుల ప్రదర్శన


మహిళల కోలాటాలు





కన్నుల పండువగా శోభాయాత్ర



- పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం.. పాల్గొన్న కవ్వంపల్లి..
- ప్రధాన ఆకర్షణగా గుర్రాలు, ఒంటెలు, వివిధ వాహనాలు
- ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 21: జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారి శోభాయాత్రను నేత్రపర్వంగా నిర్వహించారు. మార్క్‌ఫెడ్ గ్రౌండ్ వద్ద శోభాయాత్ర ప్రారంభం కాగా గరుడ వాహనంతో కూడిన ప్రత్యేక రథంపై వేంకటేశ్వరస్వామి అందరికీ కనువిందు చేశారు. శ్రీవారికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఫలాలు సమర్పించి పూజలు నిర్వహించారు. మార్క్‌ఫెడ్ గ్రౌండ్ వద్ద ప్రారంభమైన యాత్ర రాంనగర్, మంకమ్మతోట, తెలంగాణచౌక్, బస్టాండ్, టూటౌన్ పోలీస్ స్టేషన్ ద్వారా ఆలయానికి చేరుకుంది. పూజల అనంతరం మంత్రి పొన్నం స్వయంగా ట్రాక్టర్ (రథం) నడపుతూ, నగారా మోగిస్తూ అందరినీ ఉత్సాహ పరిచారు. యాత్రలో శ్రీవారి శేష, చంద్రప్రభ, సూర్యప్రభ, గజ, సింహ, కల్పవృక్ష, అశ్వ, హనుమంత వాహనాలు పాల్గొన్నాయి. ఎనిమిది గుర్రాలు, ఒంటెలు, నంది కోల, ఘటం, నగారా, ఒగ్గుడోలు, మహిళలు, డప్పులు, గుస్సాడి, గోమాతలు, బోనాలు, కేరళ మేళం, చిరుతల భజన, బంజారా, అఘోరా, మహంకాళి, కళాకారుల ప్రదర్శనలు, తమ్మ శ సౌన్నాయి, నాదస్వరం బృందాలు కనువిందు చేశాయి.

భక్తజన నీరాజనం..

తిరుమలలో మాదిరి జరిగిన శోభాయాత్రను తిలకించేందుకు భక్తులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. యాత్రలో పాల్గొని భజనలు, గోవిందనా మస్మరణలు చేస్తూ భక్తిపారవశ్యంలో మునిగి తేలారు. మహిళలు మంగళహారతులు పట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, నగర ధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అనిల్, నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున రాజేందర్, కటకం వెంకట రమణ, వెలిచాల రాజేందర్ రావు, సంగీతం శ్రీనివాస్, నార్ల కార్తిక్, జక్కుల మల్లేశం, పద్మాకర్‌రెడ్డి, భాస్కర్, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పి సత్యనారాయణ, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో వుడుతల వెంకన్న పాల్గొన్నారు.


నగారా కళాకారుల ప్రదర్శన

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


సతీష్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21: మండలంలోని బొప్పాపూర్ గ్రామశివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం ఇసుక ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాకు చెందిన యువకుడు భూక్య సతీష్(22) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. అదే తండాలోని యువకుడు భూక్య సాయికుమార్ తీవ్రగాయాలయ్యాడు. ఎస్‌ఐ రమాకాంత్ కథనం మేరకు.. వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాలోని భూక్య మంజుల- రాజు దంపతుల ఒక్కాగానొక్క కొడుకు సతీష్ ఎలక్ట్రిషియన్‌గా పనులు చేస్తుండేవాడు. బుధవారం ఉదయం తన ద్విచక్రవాహనం పై స్నేహితుడు సాయికుమార్‌తో కలిసి ఇంటి నుంచి గొల్లపల్లికి బయలుదేరారు. బొప్పాపూర్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ అతి వేగంగా ఢీకొట్టింది. దాంతో బైక్ ట్రాక్టర్ బాగంలో చిక్కుకుపోయింది. సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాల పాలైన సాయికుమార్ పరిస్థితి విషమంగా మారింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి మంజుల ఫిర్యాదు మేరకు మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ ఆలకుంట శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

● వారంలో గల్ఫ్ దేశానికి.. అంతలోనే అనంత లోకాలకు..

వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాలోని యువకుడు భూక్య సతీష్ వారం రోజుల్లో గల్ఫ్ దేశానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న క్రమంలో అతన్ని విధి రోడ్డు ప్రమాదం రూపంలో బలితీసుకుంది. కన్న కొడుకు గల్ఫ్ దేశానికి పయనమవుతున్న తరుణంలో అనంత లోకాలకు వెళ్లడంతో కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. తండాలోని మంజుల-రాజు దంపతులు కొడుకు సతీష్. రాజు రెండు నెలల కిందట గల్ఫ్ దేశానికి వలస వెళ్లాడు. కొడుకును గల్ఫ్ తీసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. వారం రోజుల్లో పయనమవుతాడనుకున్న కొడుకు తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. మృత వార్త తెలుసుకున్న తండ్రి రాజు స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు.


ట్రాక్టర్ కింద భాగంలో చిక్కుకున్న బైక్

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 21: రెండు రోజుల కిందట అదృశ్యమైన వృద్ధుడు నేహూరి చంద్రారెడ్డి(60) తన ఇంటి సమీపంలోని పాడు పడిన పశువుల పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం విషాదం నింపింది. ఎస్‌ఐ రమాకాంత్ కథనం మేరకు.. గ్రామంలోని చంద్రారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురవడంతో ఈ నెల 18న కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఈ నెల 19 ఉదయం నిద్రలేచే సరికి వృద్ధుడు చంద్రారెడ్డి కనిపించకుండాపోయాడు. బంధువులు, చుట్టు పక్కల ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. దాంతో తమ మామ కనిపించడం లేదని పేర్కొంటూ కోడలు అనురాధ ఈ నెల 20న ఫిర్యాదు చేయడంతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన చంద్రారెడ్డి తన ఇంటి సమీపంలోని పశువుల పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటు వైపు వెళ్లిన స్థానికులకు దుర్వాసన రావడంతో గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

క్రమశిక్షణ, చట్టాలపై అవగాహన ఉండాలి

- అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ - పీటీసీ, సీటీసీల్లో కానిస్టేబుల్ శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న మహేష్ భగవత్, అభిషేక్ మొహంతి, శిక్షణకు హాజరైన కానిస్టేబుల్ అభ్యర్థులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: పోలీసుశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం పొందినవారు క్రమశిక్షణ, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ అన్నారు. పోలీసుశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కరీంనగర్‌లోని పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ), సిటీ పోలీసు శిక్షణ కేంద్రం (సీటీసీ)లో బుధవారం నుంచి శిక్షణ ప్రారంభమైంది. ఈ శిక్షణను రాంనగర్‌లోని పీటీసీలో అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ ప్రారంభించగా, ఉజ్వల పార్క్ వద్ద సీటీసీలో పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి ప్రారంభించారు.

ఈ సందర్భంగా అడిషనల్ డీజీ రైల్వేస్ మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ అభ్యర్థులు శిక్షణ సమయంలో ఏకాగ్రతతో నేర్చుకున్నట్లయితే ఉద్యోగం సమయంలో సమర్థవంతంగా పనిచేయగలుగుతారన్నారు. పోలీసు ఉద్యోగం అనేది ఒక బాధ్యతాయుత మైనదన్నారు. సమాజంలో రోజురోజుకు నేరాలు పెరుగుతున్నాయని, సైబర్ నేరాలు నియంత్రణ కోసం సాంకేతిక పరిజ్ఞానంపై పట్టుసాధించాలన్నారు. రాంనగర్‌లోని పీటీసీలో హైదరాబాద్, రాచకొండ, సైబారాబాద్, నల్గొండ, గద్వాల నుంచి 675 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు శిక్షణకు హాజరయ్యారు. వీరందరికీ 9 నెలలపాటు ఇక్కడే శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్, డీఎస్పీలు మల్లికార్జున్, విజయపాల్‌రెడ్డి, శ్రీనివాస్, మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

● ప్రజలకు సేవచేసే అవకాశం అధికం: సీపీ

ఇతర ప్రభుత్వ శాఖలకంటే పోలీసు శాఖ ద్వారా ప్రజలకు సేవచేసే అవకాశం అధికమని కరీంనగర్ పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. కరీంనగర్ సీటీసీలో సంగారెడ్డి జిల్లాకు చెందిన 235 మంది కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులకు శిక్షణను బుధవారం సీపీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న 30 సంవత్సరాల పాటు పోలీసుశాఖ తరపున ప్రజలకు సేవలు అందించే బాధ్యత ఉంటుందన్నారు. పోలీసు ఉద్యోగం చేయాలంటే ఫిజికల్ ఫిట్‌నెస్ ముఖ్యమని, శిక్షణలో కరీంనగర్ మొదటి స్థానంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపాల్ అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, ఏసీపీ వేణుగోపాల్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరి పరిస్థితి విషమం

ముస్తాబాద్, ఫిబ్రవరి 21: మండలంలోని నామాపూర్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన దమ్మన్నపేట నర్సింహరాలు (50), దమ్మన్నపేట దేవయ్యలు (55) ముస్తాబాద్ నుంచి లింగన్నపేట వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. నామాపూర్ గ్రామంలో ఎదురుగా వచ్చిన ట్రాలీఆటో ఢీకొట్టడంతో నర్సింహరాలు మృతిచెందగా తీవ్రగాయాలైన దేవయ్య సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

వ్యవసాయబావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య


పప్పు నర్సయ్య(ఫైల్)

మానకొండూర్, ఫిబ్రవరి 21: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన పప్పు నర్సయ్య (90) అనే వృద్ధుడు బుధవారం వ్యవసాయబావిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. నర్సయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా నయం కాలేదని తెలిపారు. వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గ్రామంలోని వ్యవసాయబావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కుటుంబసభ్యుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని బావిలో నుంచి మృతదేహాన్ని బయటికి తీశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ గౌతమి


జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గౌతమి

వేములవాడ, ఫిబ్రవరి 21: మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గౌతమి ఆలయ అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను బుధవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జాతర ఏర్పాట్లలో అలసత్వం వహించవద్దని, పనుల్లో వేగం పెంచాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు సమన్వయ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, క్యూలైన్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ ఏర్పాట్లు తదితర పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఈఈ రాజేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు, ఎడ్ల శివ ఉన్నారు.

రాజన్న సేవలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే

వేములవాడ ఫిబ్రవరి 21: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దర్శించుకున్నారు. బుధవారం నాడు ఆయన కుటుంబ సమేతంగా కోడె మొక్కు చెల్లించుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించగా, ఆలయ సూపరింటెండెంట్ అల్లి శంకర్ స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు ఆయన వెంట ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గంగాధర, ఫిబ్రవరి 21: బతుకు దెరువుకోసం వచ్చిన ఓ యువకుడు మేస్త్రీ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన మండలంలోని గర్శకుర్తిలో బుధవారం జరిగింది. ఎస్ఐ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం నెల్లూరు జిల్లాకు చెందిన చీమలదిన్నె బాలగురవయ్య(26) కొద్ది రోజులుగా గర్శకుర్తిలో భవన నిర్మాణ మేస్త్రీగా పని చేస్తున్నాడు. బుధవారం ఇంటి స్లాబ్‌పై సైడు గోడ కడుతున్నాడు. పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు బాలగురవయ్య చేయి తాకి కరెంటు షాక్ మృతి చెందాడు.మృతుడి సోదరుడు శ్రీనివాసులు ఫిర్యాధు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఖాతాదారులను మోసం చేసిన అక్షర చిట్‌ఫండ్స్

- చైర్మన్, ఇద్దరు డైరెక్టర్ల అరెస్టు


నిందితులను అరెస్టు చూపుతున్న ఒకటో ఠాణా ఎస్ఐ రవికుమార్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: ఖాతాదారులకు సకాలంలో డబ్బులు చెల్లించకుండా మోసగించినందుకు, ఖాతాదారుల డబ్బులతో సొంత ఆస్తులు కూడబెట్టుకునందుకు కరీంనగర్‌లోని అక్షర చిట్‌ఫండ్స్‌పై ఇటీవల ఒకటో ఠాణా, రెండో ఠాణాల్లో కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు అక్షర చిట్‌ఫండ్స్ చైర్మన్ పేరాల శ్రీనివాసరావు, ఇద్దరు డైరెక్టర్లు సూరినేని కొండలరావు, ఉప్పల రాజేందర్‌ను ఒకటో ఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మరో ముగ్గురు డైరెక్టర్లపై కేసు నమోదైంది. ఒకటో ఠాణా పోలీసుల వివరాల ప్రకారం.. చిట్ డబ్బులు సభ్యులకు చెల్లించకుండా మోసం చేసినందుకు ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిట్స్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1999 సెక్షన్ 3, 4 ప్రకారం నిందితులపై ఐపీసీ సెక్షన్ 406, 420 రెడ్‌విత్ 34, 5 కింద అక్షర చిట్‌ఫండ్స్ చైర్మన్, ఐదుగురు డైరెక్టర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్‌కు చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి శ్రీరాం వెంకటరెడ్డి అక్షర చిట్‌ఫండ్స్‌లో రూ.7 లక్షల చిట్ వేశాడు. చిట్ గడువు ముగిసినప్పటికీ డబ్బులు చెల్లించకుండా చిట్‌ఫండ్స్ యాజమాన్యం ఇబ్బందులకు గురిచేశారు. బాధితుడు ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశాడు. హన్మకొండలోని సుబేదారి, వడ్డేపల్లి ఎక్స్‌రోడ్ ఎస్‌టీహెచ్ కాలనీకి చెందిన పేరాల శ్రీనివాసరావు అనే వ్యక్తి తిరుపతిరెడ్డి అనే వ్యక్తితో కలిసి హన్మకొండలో అక్షర చిట్ ఫండ్స్ సంస్థను ఏర్పాటు చేశారు. ఆ తరువాత తిరుపతిరెడ్డి ఆ సంస్థ నుంచి ఉపసంహరించుకోగా శ్రీనివాసరావు భార్య శ్రీవిద్య, సూరినేని కొండలరావు, ఉప్పల రాజేందర్, అలువల వర్షప్రసాద్, గోనె రమేష్‌లు డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు. అక్షర చిట్‌ఫండ్స్‌కు కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్, బోధన్, ఆదిలాబాద్, పెద్దపల్లి, గోదావరిఖని, మంచిర్యాల, హైదరాబాద్, ఖమ్మం, నల్గొండ, ఇతర పట్టణాలలో 54 బ్రాంచిలు ఉన్నాయి. ఏజెంట్ల నుంచి సభ్యులను చేర్పించుకుని చిట్స్ నిర్వహిస్తున్నారు. ఖాతాదారుల నుంచి సేకరించిన డబ్బులతో ఆ సంస్థ పలు చోట్ల భూములు కొనుగోలు చేసింది. గడువు ముగిసిన సభ్యులకు చిట్ డబ్బులు చెల్లించకుండా, ఆ డబ్బులకు అధిక వడ్డీ చెల్లిస్తామని వారిని నమ్మించి ప్రభుత్వ అనుమతి లేని డిపాజిట్ బాండ్ల రూపంలో బాండ్‌లను ఇస్తూ కాలయాపన చేశారు. బాండ్ల కాలపరిమితి ముగిసినా తిరిగి రెన్యూవల్ చేస్తూ వచ్చారు. ఖాతాదారుల డబ్బులతో వెదిర, వెలిచాలలో అక్షర టౌన్‌షిప్, అక్షర టౌన్‌షిప్ ఇండియా పేరిట 50 ఎకరాల భూమి కొనుగోలు చేశారని, గాడిపల్లి, నగునూర్‌లలో కూడా కొంత భూమి కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్‌లోని నాలుగు బ్రాంచీల్లో 800 మంది సభ్యులను చేర్చుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో అరెస్టు చేసిన ముగ్గురిని కోర్టులో హాజరుపరచి జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

హనుమాన్‌నగర్‌లో అగ్నిప్రమాదం

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 21: పట్టణంలోని హనుమాన్‌నగర్ లోని ఓ ఇంటిలో బుధవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. పెంకుటిల్లుకు అంటుకున్న మంటలను అదుపుచేసి పక్కనే గల రెండు గదులకు ప్రమాదం సంభవించకుండా చర్యలు తీసుకున్నారు. సుమారు గంటపాటు శ్రమించి అగ్నిమాపక సిబ్బంది పూర్తిగా మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో సుమారు నాలుగు లక్షల 50 వేల రూపాయల నష్టం వాటిల్లినట్లు ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ తెలిపారు. నిత్యావసర వస్తువులు, బంగారం, వెండి, గ్యాస్ సిలిండర్ సర్టిఫికెట్స్ బట్టలు కొంత నగదు, టీవీ, బట్టలు, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధం అయినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది మహమ్మద్ సిరాజుద్దీన్, పి చంద్రయ్య, కె శ్రీనివాస్, వి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం, సైకిల్ ఢీ: ఒకరి మృతి

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 21: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో గల పెద్దంపల్లి గ్రామ కమాన్ సమీపంలో ద్విచక్ర వాహనం, సైకిల్ ఢీకొన్న సంఘటనలో దొడ్డె పరుశురాములు (59) మృత్యువాత పడ్డాడు. పెద్దంపల్లి గ్రామానికి చెందిన దొడ్డె పరుశురాములు గ్రామంలోని ఓ శుభకార్యానికి హాజరై తిరిగి ద్విచక్రవాహనంపై జమ్మికుంటకు వస్తున్నాడు. అదే సమయంలో అటువైపు వెళ్తున్న నరసయ్యను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. ఈ క్రమంలో పరుశురాములు అక్కడికి అక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరగంటి రవికుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సుబ్రమణ్యం(60) అనే వృద్ధుడు మంగళవారం రాత్రి మృతి చెందాడని అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 13న వేములవాడలో చెట్టు పైనుంచి కిందపడి గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో తీసుకువచ్చిన కొందరు వ్యక్తులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వెళ్లినట్లు తెలిపారు. సుబ్రమణ్యం ప్రకాశం జిల్లా దర్శి మండలానికి చెందిన వ్యక్తిగా ఆసుపత్రి రికార్డులో నమోదై ఉందని, మిగతా వివరాలు తెలియరాలేదన్నారు.

కోల ప్రశాంత్‌కు వేములవాడ పోలీసుల పీటీ వారెంట్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: నకిలీ డాక్యుమెంట్లతో భూకబ్జాలకు పాల్పడి కోటి 37 లక్షలు వసూలు చేసిన కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న కార్పొరేటర్ భర్త కోల ప్రశాంత్‌ను బుధవారం వేములవాడ పోలీసులు పీటీ వారెంట్‌పై జైలు నుంచి తీసుకువెళ్లారు. కోల ప్రశాంత్‌పై వేములవాడలో రెండు ఎస్సీ, ఎస్టీ, రెండు భూకబ్జా కేసులు నమోదైనట్లు సమాచారం. ఈ కేసుల్లో కోల ప్రశాంత్‌ను నిందితుడిగా కోర్టులో హాజరుపరిచేందుకు పీటీ వారెంట్‌పై తీసుకువెళ్లారు.

● భూకబ్జా, బెదిరింపులకు సంబంధించిన కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్యను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. విచారణ అనంతరం బుధవారం సాయంత్రం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో భూమయ్యను ఇప్పటికే పోలీసులు రెండుసార్లు కస్టడీకి తీసుకుని ఆయన ఇంటిలో సోదాలు జరిపి పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకోగా మంగళవారం మరోసారి కస్టడీకి తీసుకుని విచారించారు. తీగలగుట్టపల్లిలో భూమయ్య పలు భూకబ్జాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపులు తయారు చేసి పంచాయతీకార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

రాజకీయ లబ్ధికోసమే సర్పంచ్‌లపై ఎంపీ మొసలి కన్నీరు


బండి సంజయ్ సర్పంచులకు రాసిన లేఖ ప్రతులను చూపుతున్న జడ్పీ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 21: ఎంపీగా బండి సంజయ్ ఏనాడూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏ ఒక్క గ్రామాన్ని సందర్శించలేదని, సర్పంచులకు ఎలాంటి ఆర్థిక సహాయం చేయలేదని, ఎన్నికలు సమీపించే సరికి రాజకీయ లబ్ధి కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారని కరీంనగర్, హన్మకొండ, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్లు కనుమల్ల విజయ, డాక్టర్ సుధీర్‌బాబు, ద్వావ వసంత విమర్శించారు. బుధవారం కరీంనగర్‌లో వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎంపీ సంజయ్ సర్పంచులకు మీ ఆదరాభిమానాలు ఉండాలని లేఖ రాయడాన్ని తీవ్రంగా ఖండించారు. సర్పంచులు ఐదేళ్ల అధికారంలో ఉండగా ఏనాడూ స్థానిక సమస్యల గురించి, సర్పంచుల సమస్యలపై, గ్రామాల అభివృద్ధికి నిధుల మంజూరును గానీ పట్టించుకోలేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో సర్పంచుల ముందు మొసలికన్నీరు కారుస్తున్నాడని విమర్శించారు. గ్రామాలకు నిధులు మంజూరు చేయాలని పార్లమెంట్‌లో ఏనాడూ సంజయ్ మాట్లాడలేదని, ఆయనకు ఏ భాషపై కూడా పరిజ్ఞానం లేదన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా ఆయన పూర్తిగా అనర్హుడని విమర్శించారు. ఉపాధిహామీ పనిదినాలను 13 కోట్ల నుంచి ఏడు కోట్ల పనిదినాలకు తగ్గిస్తే కనీసం గ్రామాల్లో కూలీలకు పని కల్పించాలని ఏనాడూ కోరలేదని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లోని ప్రతి ఇంటికి నల్లానీటిని అందించే పథకాన్ని నీతిఆయోగ్ ప్రశంసిస్తూ 24 కోట్ల రూపాయలు రాష్ట్రానికి ఇవ్వాలని రెకమండ్ చేస్తే వాటిని కేంద్రం ఇవ్వలేదని, దీనిపై కూడా సంజయ్ నోరుమెదపలేదని అన్నారు. ఇంటింటికి రాముని ఫొటోలను పంపిణీ చేయడం కాదు, ఎంపీగా ప్రజలకు ఏమి చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఒక్క జడ్పీ సమావేశానికి కూడా ఎంపీగా సంజయ్ హాజరు కాలేదన్నారు. వ్యవసాయాన్ని ఉపాధిహామీతో అనుసంధానం చేయాలని మాజీ సీఎం కేసీఆర్ అనేకసార్లు ప్రధానికి లేఖరాస్తే ఎందుకు దానిపై స్పందించలేదని నిలదీశారు. ఇప్పుడు సర్పంచులకు అండగా ఉంటామని చెబుతూ మొసలికన్నీరు కారుస్తున్నారని, ఏ సర్పంచు ఆయనను నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు తానే తెచ్చానని, రాష్ట్రంలోని అన్ని పథకాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులేనని సంజయ్ చెప్పుకోవడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో జడ్పీకి 20శాతం ఇవ్వాల్సి ఉండగా మోదీ సర్కార్ ఐదు శాతానికి తగ్గించిందని, దీనిపై ఏనాడైనా సంజయ్ మాట్లాడాడా అని ప్రశ్నించారు.



కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య



భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం



జంపన్నవాగు వద్ద యాట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



జాతరలో జాతకాలు చెబుతున్న కోయదొరలు



జంపన్నవాగులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు

ఆంధ్రజ్యోతి వన-జన జాతర February 21-24 2024

మేడారం.. జన సంద్రం..

- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం



సమ్మక్క గద్దె

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని భావిస్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. ద్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.

దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాటపట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్ల బండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటు చూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జనమైంది.



వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.



జంపన్నవాగు నుంచి గద్దెల వద్దకు వచ్చే దారిపై భక్తజనం రద్దీ



కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రామడుగు, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం 34 మంది లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కలిగేటి కవిత, ఉపాధ్యక్షుడు పూరెల్ల గోపాల్, జిల్లా కోఆప్షన్‌సభ్యులు శుక్రుద్దీన్, తహసీల్దారు భాస్కర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

గంగాధర, ఫిబ్రవరి 21: ఇష్టంతో చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సత్యం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈసందర్భంగా మలబార్ గోల్డ్‌లోన్‌వారు అందించిన 1.28లక్షల స్కాలర్‌షిప్పులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ప్రమీల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట పొలాలకు మిడ్ మానేరు నీరు

సైదాపూర్, ఫిబ్రవరి 21: రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో మిడ్ మానేరు కుడి కాలువ నీరు సైదాపూర్ మండలంలోని జాగీర్‌పల్లి, గుజ్జులపల్లి రైతుల పంట పొలాలకు బుధవారం చేరాయి. ఈ నెల 14న 'ఆంధ్రజ్యోతి'లో ఎండుతున్న పంటలు అనే కథనం ప్రచురితమయింది. ఆ కథనానికి స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కాలువ పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించి పంటలు ఎండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దాంతో అధికారులు మిషన్ల సహాయంతో కాలువలో పేరుకుపోయిన గడ్డి తొలగించి నీరు అందేలా చేశారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

వీణవంక, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలచాలన్నారు. ప్రిన్సిపాల్ రాజిరెడ్డి పాల్గొన్నారు,

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

హుజూరాబాద్, ఫిబ్రవరి 21: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంవత్సరాల తరబడి గత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయక పోవడంతో యువత తీవ్ర నిరాశకు లోనవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, కుమార్, సమ్మయ్య, రియాజ్, కొంరయ్య, మధుకర్, శంకర్, అచ్యూత్, వెంకటేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతర కమిటీ సభ్యులకు సన్మానం

హుజూరాబాద్, ఫిబ్రవరి 21: హుజూరాబాద్ పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట వద్ద జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీని బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జాతర చైర్మన్ మూగల రాజిరెడ్డి, వైస్ చైర్మన్ గాలిపు నరేష్, కుర్ర శ్రీనివాస్‌గౌడ్, మిడిదొడ్డి రాజు, కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 21: మండలంలోని గండ్రపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కుడిసియ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పాఠశాలలోని విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మంజుల, సూపర్వైజర్ స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీపీని సన్మానించిన మున్సిపల్ చైర్మన్

జమ్మికుంట, ఫిబ్రవరి 21: హుజూరాబాద్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ శ్రీనివాస్‌జీని బుధవారం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు కలిసి సన్మానించారు. గతంలో జమ్మికుంట సీఐగా పని చేసిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

తిమ్మాపూర్, ఫిబ్రవరి 21: మండలంలోని వివిధ గ్రామాలలో ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈపాస్ మెషీన్ ద్వారానే అమ్మకాలు జరపాలని నిర్వాహకులను ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారి సురేందర్ పాల్గొన్నారు.

బల్దియా అద్దె బకాయిలపై కొరడా

● ఒక దుకాణం సీజ్

కరీంనగర్ టౌన్,ఫిబ్రవరి 21: నగరపాలక సంస్థ నిర్మించిన వాణిజ్య సముదాయాలకు అద్దెలు చెల్లించకుండా బకాయిలు పేరుకుపోతుండటంతో దుకాణ యజమానులపై నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. కమిషనర్ బి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారి అంజనేయులు ఆధ్వర్యంలో బల్దియా వాణిజ్య సముదాయాల అద్దె బకాయిలను వసూలు చేశారు. బకాయిలను చెల్లించాలంటూ పలుమార్లు నోటీసులు జారీ చేసిన అధికారులు బుధవారం దుకాణాలకు వెళ్లి అద్దె చెల్లించకుంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. దీనితో 17,18,19 దుకాణాలకు సంబంధించిన అద్దె బకాయిలు రూ.6,84,900 చెక్కులను తీసుకున్నామని ఆర్‌వో అంజనేయులు తెలిపారు. అలాగే 20నెంబర్ బకాయిలు చెల్లించకపోవడంతో దుకాణాన్ని సీజ్ చేశామని, బకాయి చెల్లించకపోతే చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించామని చెప్పారు.



అద్దె బకాయిలను వసూలు చేస్తున్న మున్సిపల్ రెవెన్యూ అధికారులు

అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలి

కరీంనగర్ టౌన్: జిల్లా కేంద్రంలోని 42వ డివిజన్ ఆదర్శనగర్‌లో అగ్ని ప్రమాదం జరిగి గుడిసెలు దగ్ధమైన సంఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఒడ్డెరకార్మికుల గుడిసెల ప్రాంతాన్ని సందర్శించి, బాధితులను పరామర్శించారు. గుడిసెలు దగ్ధమైన బాధితులందరికీ కలిపి తక్షణ సహాయంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా డేవిడ్ రవికాంత్

కరీంనగర్ క్రైం: కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్(డీసీ) డేవిడ్ రవికాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల కరీంనగర్ ఇన్‌చార్జి డీసీగా పనిచేసిన విజయభాస్కర్‌రెడ్డి బదిలీకాగా ఆయన స్థానంలో డేవిడ్ రవికాంత్ నియామకమయ్యారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: కరీంనగర్ శాస్త్రిరోడ్‌లో గప్‌చుప్ బండి నడుపుతున్న బీహార్ రాష్ట్రం మధుబని జిల్లా మురేట్‌కు చెందిన వివేక్‌పాశ్వాన్(21) మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో విద్యుదాఘాతంతో మృతి చెందాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. వివేక్ పాశ్వాన్ తండ్రితో పాటు శాస్త్రిరోడ్‌లో గప్‌చుప్‌లను ఇనుపరేకుల బండిలో పెట్టి విక్రయిస్తుంటాడు. మంగళవారం రాత్రి 11 గంటలకు బండిని నీటితో శుభ్ర పరుస్తుండగా విద్యుత్ సరఫరా జరిగి వివేక్ పాశ్వాన్ కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సచేయిస్తుండగా అర్ధరాత్రి 1:30 గంటలకు మరణించినట్లు తెలిపారు. మృతుడి తండ్రి బిందేశ్వర్ పాశ్వాన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధితులకు అండగా ఎంపీ సంజయ్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 21: జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్‌లో మంగళవారం అగ్నిప్రమాదానికి గురై 21 పూరిగుడిసెలు దగ్ధం కాగా, ఈ ఘటనలో నిరాశ్రయులను బాధితులకు ఎంపీ బండి సంజయ్‌కుమార్ అండగా నిలిచారు. మంగళవారం అక్కడ నిరుపేద కుటుంబాల కోసం బీజేపీ శ్రేణుల ద్వారా అవసరమైన నిత్యావసర వస్తువులు, వంట పాత్రలను, ఇతర సామగ్రిని అందించారు. బుధవారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజన వసతిని సంజయ్ సూచన మేరకు కల్పించారు.

కరీంనగర్ చేరిన ఛత్తీస్‌గఢ్ మహిళా నేత యాత్ర

భగత్‌నగర్, ఫిబ్రవరి 21: ఛత్తీస్‌గఢ్ బీజేపీ మహిళా నేత మారాజ్యలక్ష్మి మంద ద్విచక్ర వాహన యాత్ర బుధవారం రాత్రి కరీంనగర్ చేరుకుంది. కరీంనగర్ బీజేపీ శ్రేణులు నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. చొప్పరి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూలో సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 21: శాతవాహన యూనివర్సిటీలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ ద్వారా విధులు నిర్వహిస్తున్న వర్కర్స్ ఉద్యోగుల అవుట్ సోర్సింగ్ విధానానికి సహకరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్‌లో ఉండి యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించడం కోసం ప్రభుత్వ నిబంధనల మేరకు చట్టబద్ధంగా వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సంకసాల మల్లేష్ తీసుకుంటున్న చర్యలపై కొంతమంది చేస్తున్న అసత్య ప్రచారాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తరుపున తీసుకెళ్లారు. మంత్రిని కలిసిన వారిలో ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పి.చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ న్యాలం కిషన్ గౌడ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 21: గొర్రెలు, మేకల వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆ సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. గొర్రెల మేకలవృత్తిదారులసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్నయాదవ్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. రెండో విడత నగదు బదిలీ, గొర్ల కాపరులకు ఎక్స్‌గ్రేషియా, పెన్షన్, గొల్ల కురుమల సహకార సంఘాల అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో సందబోయిన ప్రసాద్‌యాదవ్, రాధారపు కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌యూకు నిధుల కేటాయింపుపై బీజేపీ సంబరాలు

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 21: శాతవాహన విశ్వవిద్యాలయానికి ప్రధానమంత్రి రూ.20కోట్లు మంజూరు చేసిన సందర్భంగా కరీంనగర్‌లో బీజేపీ శ్రేణులు బుధవారం సంబరాలు నిర్వహించారు. యూనివర్సిటీ వద్ద స్వీట్లు పంపిణీ చేసి ప్రధాని మోదీ, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బీజేపీ ప్రభుత్వం యూనివర్సిటీలను బలోపేతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ డి.శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూబల శ్రీనివాస్, జిల్లా మీడియాసెల్ కన్వీనర్ కటకం లోకేష్,జిల్లా ఆఫీస్ ఇంచార్జి గుంజేటి శివకుమార్, జిల్లా అధికార ప్రతినిధి స్వామి, సుధాకర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 21: నగరంలోని రాజీవ్‌చౌక్ నుంచి బాలికల జూనియర్ కళాశాలకు వెళ్లే దారిలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేయడమే కాకుండా ఏకంగా షెడ్లు నిర్మించారన్నారు. మున్సిపల్ అధికారులు ఇచ్చిన ఇంటి నెంబర్లను తొలగించాలన్నారు.

రేకుర్తి సమ్మక్క జాతర వద్ద మంచినీటి కేంద్రం ఏర్పాటు

సుభాష్‌నగర్,ఫిబ్రవరి21: రేకుర్తిలోని సమ్మక్క-సారక్క జాతరలో నగరంలోని సంజీవని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంచినీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు బాధ్యులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం మంచినీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుదగోని మాధవి, ఏదుల్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మంచినీటిని అందచేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ నవీన్‌కుమార్

మాజీ ఏఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 21: అక్రమ వడ్డీ వ్యాపారం సాగించిన మాజీ ఏఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని మాజీ ఏఎస్‌ఐ మోహన్‌రెడ్డి బాధితుల సంఘం కార్యదర్శి నంది కొండ అంజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పోలీస్ కమిషనర్‌ను కోరారు.

● సంక్షిప్త సమాచారం..

● కరీంనగర్‌కల్చరల్: చింతకుంటలో సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. బుధవారం సారలమ్మను గద్దెపైకి తీసుకవచ్చారు. కార్యక్రమంలో జాతర వ్యవస్థాపకులు ఎల్లమ్మ, తిరుపతి, జాతర అధికారి నాగుల అనిల్‌కుమార్, క్లర్క్ మహేశ్ పాల్గొన్నారు.

● కరీంనగర్ అర్బన్ : ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మతుల్లా హుస్సేన్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌హుస్సేన్ కలిశారు.

● సుభాష్‌నగర్ : నగరంలోని ఆదర్శనగర్ ప్రాంతంలో గుడిసెలు దగ్ధమైన ఘటనపై ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ శాఖ బాధ్యులు స్పందించారు. బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, టార్పాలిన్‌లు, దుప్పట్లను ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ పెండ్యాల కేశవరెడ్డి, ప్రధానకార్యదర్శి ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, ఈసీ మెంబర్స్ కోల అన్నారెడ్డి ఉన్నారు.

● కరీంనగర్ రూరల్: నగరంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సిబిఎస్ఈ) పాఠశాల విద్యార్థులు సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్‌లో ప్రతిభకనబరిచారు. ఇంగ్లిష్ ఒలంపియాడ్‌లో చాతర్య లోకేష్, సైవర్ధన్, నేషనల్ సైన్స్ ఒలంపియాడ్‌లో నేహశ్రీ, ఇంటర్నేషనల్ మాథ్స్ ఒలంపియాడ్‌లో సిరి, సాధ్వి, హన్సిక్ విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు రెండవ లెవల్‌కు అర్హత సాధించగా చైర్మన్ డాక్టర్ పాతిమారెడ్డి అభినందించారు.

● సుభాష్‌నగర్ : హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంటకు చెందిన మూడవ వార్డు కౌన్సిలర్ రవీందర్‌కు షోకాస్ నోటీసు జారీ చేసినట్లు డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి తెలిపారు. కౌన్సిలర్ మేడిపల్లి రవీందర్ అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారి పట్ల కాంగ్రెస్ పార్టీ కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. భూకబ్జాలు, అవినీతి అక్రమాలపై ఉపేక్షించేది లేదని అన్నారు.

● గణేశ్‌నగర్: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యా కాషాయీకరణ, కార్పొరేటీకరణను ప్రేరేపిస్తూ నూతన జాతీయ విద్యా విధానం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నదని ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి అజాద్ అన్నారు. దీనిపై ఈ నెల 25,26 తేదీలలో హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

● కరీంనగర్ కల్చరల్: పవిత్ర రంజాన్‌మాసం సందర్భంగా ఈ నెల 25న నిర్వహించుకునే షబే బరాత్, జగ్నీకి రాత్‌కు ముస్లింల స్మశాన వాటికల వద్ద ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించాలని బుధవారం ఎంఐఎం నేతలు జిల్లా కలెక్టర్, సీపీ, మేయర్, మున్సిపల్ కమిషనర్, విద్యుత్ ఎస్ఈలకు వినతిపత్రం సమర్పించారు.

● భగత్‌నగర్: యువతకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్ అన్నారు. బుధవారం నగరంలోని జిల్లా కార్యాలయంలో మాట్లాడారు.

● రామడుగు: మండలంలోని గుండి గ్రామపంచాయతీ కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మీటర్‌లో మంటలు చెలరేగాయి. కిటికీ, తలుపులకు మంటలు అంటుకోవడంతో గమనించిన గ్రామస్థులు మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది.